

# నల్లతోలు

## సి. రామచంద్రరావు

బోయ్ విశాలమయిన డ్రాయింగ్ రూమ్‌లో ప్రవేశించి అణకువగా ఒక పక్కన నించున్నాడు. టీ ముగించి మెత్తని సోఫాలో మునిగిపోయి బి. బి. సి. రేడియో ప్రసారం వింటున్న పేట్ రావ్ "ఏం కావాలి?" అన్నట్టు అతనివైపు చూశాడు. ఆక్స్‌ఫర్డ్‌లో గదువుకునే రోజుల్లో స్నేహితులు ప్రతాపరావుని పేట్ అని ఇంగ్లీషు సంప్రదాయంలో పిలిచేవారు. ఇండియా వచ్చింతరవాత అది పేట్ రావ్ అయింది.

"మాస్టర్, బాత్ రెడీ," అన్నాడు బోయ్. పడకగదికి అన్చికటిన స్నానాలగదికి వెళ్లడానికి పేట్ రావ్ లేచాడు. అప్పుడే ఇస్త్రీ చేసిన డిన్నర్ జాకెట్ పక్కమీద పరిచి ఉంది. డ్రెస్సింగ్ టేబిల్ పక్కనున్న సోఫాకి ముందు పాలిష్ చేసిన నల్లజోళ్లూ, వాటిమీద నలుపురంగు సాక్సూ ఉన్నాయి. సోఫా చేతిమీద డ్రెస్ సూటుతో వేసుకునే చొక్కా చేతులకి బంగారపు కఫ్ లింక్స్ తగిలించి వేళ్లాడుతూంది. టేబిల్ మీద నల్లటి 'బౌ టై' ఉంది.

"బోయ్," రౌద్రంగా అరిచాడు పేట్ రావ్.

బోయ్ పరిగెత్తుకుని వచ్చాడు.

"తెల్ల షార్క్‌స్కిన్ కోటు ఎందుకు తీశావ్?" అన్నాడు పేట్ రావ్.

ఒక్క నిముషం బోయ్ తటపటాయించాడు.

"మాస్టర్ పోయినసారి నల్ల డి. జె. వేసుకున్నారు," అన్నాడు.

"పరవా లేదు. ఇప్పుడూ అదే వేసుకుంటాను," పేట్ రావ్ అన్నాడు.

"నిజానికి బోయ్ తప్పు కాదు," అనుకున్నాడు మనసులో. ఒకపార్టీకి నల్ల డిన్నర్ జాకెట్ వేసుకుంటే, తరవాత దానికి తెల్ల డి. జె. తీసి ఉంచమని తనే ఆదేశించాడు. అయితే ఈ పార్టీ ప్రత్యేకమైంది. బోయ్‌కి చెప్పడం మర్చిపోయాడు. అయినా అప్పుడప్పుడు ఆ మాత్రం కోప్పడ్డంలో తప్పులేదు. లేకపోతే వాడు మితిమీరి పోతాడు.

బోయ్‌కీ, పేట్ రావ్‌కీ మధ్యఉన్న అనుబంధాన్ని నిర్వచించడం కష్టం. పేట్ రావ్‌కి బోయ్ అంటే అపరిమితమైన అభిమానం. బోయ్ తెలుగువాడే, పేరు లోవరాజు. ఎన్నో ఏళ్ళు దొరలకింద పనిచేసి బోయ్ అన్న పేరు గడించుకున్నాడు. పదిహేనేళ్ల క్రితం హంటర్ దొర రిటైరై ఇండియానుంచి ఇంగ్లండు వెళ్ళిపోతూ పేట్ రావ్‌కి బోయ్‌ని సిఫార్సు చేశాడు.

"పరవాలేదు, పనికొస్తాడు. ఇంగ్లీషు బాగా అర్థం అవుతుంది. కొంచెం మాట్లాడగలడు కూడా. అయితే, నీ విస్కీ ఒక కంట కనిపెట్టుకో, పేట్" అని నవ్వాడు హంటర్.

ఇంగ్లీషు మాట్లాడగలిగి విస్కీమీద మక్కువ ఉండి దొరల ప్రశంస పొందగలిగిన బోయ్‌కి వెంటనే ఉద్యోగం ఇవ్వడానికి నిశ్చయించుకున్నాడు పేట్ రావ్. తను చూపించిన ఆదరణకీ, నమ్మకానికీ అనుగుణంగా బోయ్ ప్రతి విషయంలోనూ సమర్థుడనిపించుకొన్నాడు. మాస్టర్ పొద్దున్న మేడమ్‌గది విడిచి, తన గదిలోకి వచ్చినప్పటినుంచి. ఆఫీసుకి పోయేవరకూ అన్ని అవసరాలూ బోయ్ చూస్తాడు. మాస్టరు నైట్ గౌన్, పైజమాలు విప్పడం దగ్గరనుంచీ, తలకి నూనె, ఆఫీసుబట్టలు వేసుకోడం వరకూ, ప్రతి విషయంలోనూ సాయపడతాడు. మాస్టర్ బ్రేక్‌ఫాస్ట్‌కి ఏం తింటాడో వంటవాడికి చెబుతాడు. మాస్టర్‌కి ఎన్ని గంటలకి కారు తయారుగా ఉండాలో డ్రైవరికి చెబుతాడు. బోయ్ లేకుండా ఒక్క రోజు కూడా తనకి గడవదేమోననిపిస్తుంది పేట్ రావ్‌కి అప్పుడప్పుడు. కాని ఆ తలపుని ఆట్టేసేపు నిలవనిచ్చేవాడు కాదు. లేక ఏమైపోతాడు? తనేం లోటు చేస్తున్నాడనీ? ఎప్పుడైనా పరుషంగా మాట్లాడినా, మనసులో కోపం ఉండదు. పైకి కఠినంగా కనుపించకపోతే చనువుతీసుకోవడానికి ప్రయత్నిస్తాడు.

బోయ్‌కి కూడా మాస్టర్ అంటే భయమూ, భక్తీ. ఇంకా దొరలకింద పని చేస్తున్నట్టే అనిపిస్తుంది అంటాడు స్నేహితుల్తో. మాస్టరుకి దొరల అలవాట్లన్నీ ఉన్నాయి. డబ్బుకి వెనకాముందూ చూసుకోడు. అడపాతడపా గసురుతూ ఉంటాడు. గసరకుండా మాస్టరేమిటి? కోపం లేని మాస్టరుకి తీపీ, ఈవి కూడా ఉండదనే వాడు మెకెంజీ దొరదగ్గర పనిచేసిన పేరయ. మెకెంజీ దొరది మెత్తని స్వభావం. పల్లెత్తు మాట ఎవర్నీ అనడు. అన్నీ లెక్క ప్రకారం చూసుకునేవాడు. పనివాళ్ళకి పైన ఏమీ దొరికేదికాదు. తక్కిన దొరల్లాగ ఈయనకూడా తాగి రెండు చివాట్లు పెట్టి తరువాత రెండు బుద్దూ, డబ్బూ పారెయ్యగాద్దా అని తన దగ్గర వాపోయేవాడు ఆయన బేరు.

"నేనుతప్ప ఈవాళ పార్టీకి వచ్చే వాళ్లంతా తెల్లవాళ్ళే."

నల్ల డి. జే. వేసుకోడానికి ప్రత్యేక కారణం వివరించడానికి ప్రయత్నించాడు పేట్ రావ్. ఇటువంటి విషయాలు చెప్పేటప్పుడు బోయ్ ఎంతో సన్నిహితుడనిపించేది. పేరుపెట్టి పిలవాలనిపించేది. ఏళ్ల తరబడి అలవాటుపడ్డ సంస్కారం—ఇండియాలో పనిచేసిన ఇంగ్లీషువాళ్ళ సంస్కారం—అడ్డు వచ్చేది. అప్పుడు బోయ్ అని పిలిచినా, గొంతు మెత్తబడేది, మార్దవం ఆవరించేది.

"ఇప్పుడిప్పుడు కొందరు తెల్లకోటూ, నల్లలాగూ వేసుకుని డాన్సులకీ, ఈవినింగ్ పార్టీలకీ వెడుతున్నారుకాని స్వచ్ఛమైన బ్రిటీషర్ దాన్ని డి. జె. కిందలెక్క కట్టడు," అన్నాడు.

బోయ్ ముగ్ధుడై వింటున్నాడు. ఇది కొత్త విజ్ఞానం. రేపు స్నేహితుల్తో కబుర్లలో దొర్లించవచ్చు.

"ఇక్కడ ఉక్క భరించడానికి కొంత తేలిగ్గా ఉంటుందనీ, ఇండియన్ పార్టీలకి వేసుకుని వెళ్ళినా పరవాలేదనీ తెల్లదికూడా

పట్టించాను," తప్పును సమర్థించుకోంటున్న వాడిలాగా చెప్పాడు పేట్ రావ్.

బోయ్ షార్క్‌స్కిన్ కోటుతీసి వార్డ్‌రోబ్‌లో తగిలించి విభూనాగుప్తతో కుట్టించిన నల్ల డి. జె. కోటు బయటికి తీశాడు. దాని ఖరువుకింద ఈ వేసంగిలో నాలుగయిదు గంటలు మగ్గవలసిందే. మనసుని అదుపులో పెట్టుకుని పేట్ రావ్ స్నానానికి వెళ్ళాడు.

తొట్టిలో మూడువంతులు వేడినీళ్ళు పట్టి ఉంచాడు బోయ్. నీళ్లల్లో చెయ్యముంచి వేడిచూసుకొని తృప్తిగా తొట్టిలోకి దిగాడు పేట్ రావ్. కాళ్ళ కదలికవల్ల నీళ్లు చేసే చిన్న శబ్దం తప్ప అంతా ప్రశాంతంగా ఉంది. లేత ఆకు పచ్చ చలువరాయితో కట్టిన స్నానాలగది తెల్లని నీళ్ళ తొట్టిలో మనోహరంగా ప్రతిబింబిస్తూంది. సబ్బూ, స్పాంజ్ పెట్టడానికి ఒక చివర తొట్టికే అడ్డంగా వేసిన బల్లమీదనుంచి సిగరెట్ తీసుకుని వెలిగించాడు. శరీరం బయటా, లోపలా వెచ్చగా సుఖంగా ఉంది. అతని ఆలోచనలు రాత్రి కాక్‌టైల్ పార్టీ మీదికి పోయాయి.


మిస్టర్ అండ్ మిసెస్ సూవర్, రగ్గర్ ఫుట్‌బాల్ పోటీల్లో గెలిచిన క్లబ్బుజట్టుకి రాత్రి ఏడూ, పదకొండు గంటలమధ్య క్లబ్ బ్రిడ్జిరూమ్‌లో కాక్‌టైల్ పార్టీ ఇస్తున్నారు. అతిథుల్లో తనొక్కడే ఇండియన్. రగ్గర్ జట్టులో ఇండియన్ లేనేలేడు. క్లబ్బులో ఇండియన్ మెంబర్లకి ఇది అసంతృప్తి కలిగించింది. తెల్లవాళ్ళంతా కలిసి ఇండియన్లకి చోటులేకుండా చేసేరన్నారు. "చేతకాని కబుర్లు," అనుకున్నాడు పేట్ రావ్. ఈ మధ్య వ్యాపారంలోపడి తనురగ్గర్ విషయం అట్టే పట్టించుకోపోడంవల్ల ఇందులో నిజానిజాలు చెప్పలేడు. కాని, పదహేనేళ్ళ క్రితం-క్లబ్బుల్లో నలుగురైదుగురు ఇండియన్ మెంబర్లకి నిజంగా వ్యక్తిత్వం లేనిరోజుల్లో-తను రగ్గర్ జట్టులోఉన్నాడు. అప్పటికీ ఇప్పటికీ తెల్లవాళ్ళు మనతో మంచిగా ఉండడానికి ఎంతైనా ప్రయత్నిస్తున్నారు. ఆడే సత్తువ లేకుండా సెలక్షనుకమిటీ అంతా బ్రిటిషర్లపుట్ట అని నిందించడం దేనికి?

"వాళ్లంటే మనకి అసూయ," అనుకున్నాడు అతను.

వాళ్లతో మనం తూగలేం. ఎంత అనుకరించినా మనకీ వాళ్లకీ సామాన్యఅభిరుచులు లేవు పూర్వం, తనకాలంలో, బ్రిటిష్ పరిపాలనలో, విస్కీబుడ్డిదగ్గరయినా బ్రిటిషరూ, ఇండియనూ ప్రాణమిత్రులయ్యే అవకాశం ఉండేది. ప్రొహిబిషన్ తరువాత అది కూడా లేదు. అయినా, బ్రిటిషర్ మనల్ని దూరంగా ఉంచాలని చూస్తున్నాడనడం నిజం కాదు. సమాజంలో సరయిన స్థానం ఉన్న ఇండియన్‌కి బ్రిటిషరు ప్రాణం పెట్టగలడు. వచ్చిన చిక్కల్లా సంస్కారం సరిపోకుండా పెద్ద ఎత్తులమీద మనసు పెట్టుకుని కూచున్న వాళ్లకే. అదృష్టవశాత్తూ మంచి ఉద్యోగం సంపాదించి క్లబ్బు మెంబరై కూడున్న ప్రతివాడితోనూ తెల్లవాళ్లు భుజాలు రాసుకుని తిరగాలనడం అన్యాయం.

పేట్ రావ్ సిగరెట్టు అయిపోయి పెదిమలు చుర్రుమన్నాయి. మిగిలిన ముక్కని తొట్టిపక్కగోడలో అతికిఉన్న ఏష్‌ట్రేలో పడేసి, ఎదురుగా కప్‌బోర్డులో ఉన్న టైంపీస్ వైపు చూశాడు. గుడ్ గ్రేషస్! ఏడు అవుతూంది. తొట్టిలో నీళ్లు బయటికి వదిలి, పైన ఉన్న షవర్ విప్పి తొందరగా ఒళ్ళు తుడుచుకుని బయటపడ్డాడు.





పేట్‌రావ్ డిన్నర్ జాకెట్ వేసుకుని, నిలువుటద్దంలో చూసుకుని మురిసిపోయాడు. కోటు ఫెసింగ్ తళతళ మెరుస్తూంది. పాంట్ బ్రెడింగ్ సున్నితంగా ఉంది. షర్టు కాలరూ, బౌటై, తీర్చిదిద్దినట్టు అమరాయి. గోళ్లు ఎలక్ట్రిక్ దీపం వెలుగులో జిగేల్‌మంటున్నాయి. తక్కువయిందల్లా, కోటు కాలరుకున్న బటన్ హోల్‌లో కార్నేషన్ పువ్వు. ఈ వేడిదేశంలో కార్నేషన్ మొక్కలు మొలవవు. ఏం చెయ్యడం? దానికి బదులు ఎర్ర గులాబీని అలంకరించుకున్నాడు పేట్‌రావ్. ఇంకొకసారి అద్దంలో చూసుకుని, తృప్తిగా నవ్వుకుని, పోర్చిలోకి దారితీశాడు. యూనిఫారంలో డ్రైవరు, జాగ్వార్ కారు వెనకతలుపు తీసి పక్కగా నుంచున్నాడు. పేట్‌రావ్ లోపలికి ఎక్కి కూచుని "పోదాం" అన్నాడు. డ్రైవరు తలుపుమూసి తన సీటులో కూచున్నాడు. నల్లని, విలువైన జాగ్వార్ మార్క్ VII తళతళ మెరుస్తూ నిశ్శబ్దంగా చీకటిలోకి జారిపోయింది.

*        *        *

పేట్‌రావ్ వెళ్లేసరికే డ్రిడ్జిరూమ్ జనంతో కిటకిటలాడుతూ వుంది. చాలామంది డిన్నర్ జాకెట్లలో ఉన్నారు. అయితే పేట్‌రావ్ అనుకున్నట్టు అంతా నల్లకోట్లలో లేరు. నల్లపాంట్ మీద తెల్ల జాకెట్లు గదిలో ఇక్కడా అక్కడా కనిపిస్తూనే ఉన్నాయి. లౌంజ్ సూట్లలో వచ్చినవాళ్లూ, సాదా కోటూ పేంటులవాళ్ళూ కూడా ఉన్నారు. పేట్‌రావుకి ఆశ్చర్యం వేసింది. మిస్టర్ స్టూవర్ట్ అతన్ని సాదరంగా ఆహ్వానించి పార్టీకోసం అమర్చిన బార్ దగ్గరకి తీసుకు వెళ్ళాడు.

"నీ డ్రింక్ ఏమిటి పేట్?" అన్నాడు మిస్టర్ స్టూవర్ట్.

"విస్కీ అండ్ సోడా."

మిస్టర్ స్టూవర్ట్ విస్కీ సోడా గ్లాసులో కలిపి పేట్‌రావ్‌కి అందిచ్చాడు ఇద్దరూ చేతుల్లో గ్లాసుల్ని పైకి ఎత్తి "చీయర్స్" చెప్పి తాగడానికి ఉపక్రమించారు.

"పేట్, నువ్వు మెక్‌ఫర్సన్ని కలుసుకోవాలి. మిస్టర్, మిసెస్ కూడా ఆక్స్‌ఫర్డ్ తయారీయే." మిస్టర్ స్టూవర్ట్ పేట్‌రావుని ఎనమండుగురి గుంపులోకి తీసుకువెళ్ళి పరిచయం చేశాడు. వాళ్లు ఏదో మాట్లాడుకుంటున్నారు. పేట్‌రావ్ రాక ఒక్క క్షణం కబుర్లని ఆపింది. తిరిగి మాటల్లో పడిపోయారు. అతనికి వాళ్ళకబుర్లు అంతుపట్టలేదు. కొంతసేపు ఆ గుంపులోనే నుంచుని తనకి తెలిసినవాళ్ళకోసం గదంతా కలయచూశాడు. గదిలో ఆరుగుంపుల మనుషులైనా ఉన్నారు. ఒక్కొక్క గుంపులో నలుగురు నుంచి ఆరుగురుదాకా ఉంటారు. అంతా తెల్లవాళ్ళే, వాళ్లందరిలోనూ తనొక్కడే ఇండియన్ ఉండడం పేట్‌రావ్‌కి ఎంతో సంతృప్తినిచ్చింది. ప్రతిగుంపులో ఇద్దరుముగ్గురైనా తనకి బాగా తెలిసినవాళ్ళున్నారు. తనని గుర్తించినందుకు చిహ్నంగా కొంచెం నవ్వి తలపంకించారు. వెళ్లి ఎవరితోనైనా చేరడానికి అతను సందేహించాడు. వాళ్ళు స్వంతవిషయాలు మాట్లాడుకుంటూ ఉండవచ్చు. అటువంటప్పుడు పలకరించడం మర్యాదకాదు.

పేట్‌రావ్ చేతిలో విస్కీ అయిపోయింది. ఆకాశంనుంచి ఊడిపడ్డట్టు మిస్టర్ స్టూవర్ట్ వచ్చి అన్నాడు.

"పేట్, గ్లాసు ఇలా ఇయ్యి నింపి తెస్తాను."

కృతజ్ఞతాపూర్వకంగా పేట్‌రావ్ నవ్వాడు.

"విస్కీ తెమ్మంటావా, కాక్‌టైల్ రుచి చూస్తావా?" అన్నాడు మిస్టర్ స్టూవర్ట్.

"విస్కీ, ప్లీజ్."

విస్కీ గ్లాసు పేట్‌రావ్‌కి అందిచ్చి, మిస్టర్ స్టూవర్ట్ జనంలో మాయమైపోయాడు. పేట్‌రావ్ దృష్టి గదిగోడమీద అతికిన నోటీసుమీదకిపోయింది. "గదిలో పర్మిట్ ఉన్నవాళ్ళుమాత్రమే తాగవచ్చు." అతనికి నవ్వొచ్చింది. పర్మిట్ లేకుండా ఎందరు ఇక్కడ రోజూ తాగడంలేదు? తనకిమాత్రం పర్మిట్ ఉందా? అడిగేవాళ్ళెవరో? క్లబ్బులో బ్రిటిష్ మెంబర్లందరూ ఎప్పుడో ఒకసారి తనిచ్చిన పార్టీల్లో తాగినవాళ్ళే. గవర్నమెంటు లోకంలో తనకికావలసినంత పరపతిఉంది. అసలు తనకి పర్మిట్ లేనిసంగతి ఏకొద్దిమందికో కాని తెలియదు. తెలిసిన నలుగురిమధ్యా అది నవ్వులాట అయిపోయింది. ఆ ప్రసక్తివచ్చినప్పుడు, "పేట్‌ని పర్మిట్ అడిగితే ప్రొహిబిషనే ఎత్తించేస్తాడు," అని నవ్వుతారు. తన డాక్టరు మొండిపట్టువల్ల కాని పర్మిట్ సంపాదించడం ఏమంత కష్టంకాదు. తనకి గుండెజబ్బు. "ఎక్కువగా తాగడం ప్రారంభిస్తే రెండేళ్లలో చచ్చిపోతావు," అని చెప్పేడు డాక్టరు. "పోనీ, రెండేళ్ళయినా ఆనందంగా బ్రతుకుతాను, ఇలాగ వందేళ్ళుగడిపి ఏంలాభం?" అని నవ్వాడు తను. "ఈఆటలేం కుదావు నీకు నేను సర్టిఫికేటు ఇవ్వను, ఇంకే డాక్టరూ ఇవ్వకుండా చూస్తాను," అని ప్రతిజ్ఞచేశాడు డాక్టరు. డాక్టరుకి తనమీదఉన్న అభిమానానికి అతని మనస్సు కృతజ్ఞతతో నిండింది. పేట్‌రావ్‌కి విస్కీ, బీయర్ల మీద విపరీతమైన మమకారం లేదు. నలుగుర్లో ఉన్నప్పుడు రుచిచూస్తాడు. అందుకే పర్మిట్ గురించి డాక్టరుతో రాద్ధాంతం చెయ్యలేదు. పర్మిట్ ఉన్నా నాలుగయిదు యూనిట్లు ఎన్నాళ్ళకి సరిపోతుంది? ఒక్క పార్టీ ఇవ్వడానికి కూడా రాదు. తనకి పర్మిట్ అక్కర్లేదు. "ఇంత మందిలో ఒంటరిగా ఆలోచనల్లో కాలం వెళ్ళబుచ్చేస్తున్నానే" అనిపించింది అతనికి ఒక్కసారిగా. పెళ్ళాం జ్ఞాపకం వచ్చింది. రీటా ఢిల్లీలో ఏంచేస్తుందో? అక్కతో తెల్లవాళ్లగురించి వాదిస్తూ ఉంటుంది. రీటా, సుశీ కూడా రెండేళ్ళు తండ్రితో ఇంగ్లండులో గడిపి వచ్చారు ఇద్దరూ పెళ్ళయే వరకూ ఒకే సమాజంలో పెరిగారు. అయినా ఇద్దరి మనః ప్రవృత్తులలోనూ ఎంత భేదం! రీటాకి ఇంగ్లీషు అలవాట్లంటే అభిమానం. సుశీకి గిట్టదు. "రీటా ఇక్కడ ఉంటే బాగుండేది," అనుకున్నాడు. రీటా అంటే బ్రిటిష్ కమ్యూనిటీకి ఎంతో ఆదరం. అందరికీ ఎంతో సహాయంగా ఉంటుంది. ఈవాళ పార్టీలో రీటా ఉంటే అక్కడి వాళ్ళంతా తను చుట్టూ ఉండేవారు. రీటా పంపించిన పచ్చళ్ళకి అభినందనాలు చెప్పేవారూ, ఇండియన్ ఫలహారాలు చేసి పంపమని కోరేవారూ, ఎంబ్రాయిడరీ డిజైన్లు అడిగేవారూ, ఏదో రోజు సాయంత్రం టెన్నిస్ ఆడడానికి ఇంటికి వస్తామని చెప్పేవారూ. వీటిలో తనకున్న ప్రజ్ఞ ప్రదర్శించడం రీటాకి సరదా. వెర్రి అంటుంది సుశీ. "తెల్లవాళ్ళకి ఇన్ని సమర్పించుకుంటున్నావుకదా నువ్వు, వాళ్ళు తిరిగి నీకు ఒక్కటయినా ఇచ్చారా?" అని అడుగుతోంది. ఇవ్వకేం, ఇచ్చారు. కాని రీటా అంతధారాళంగా కాదు. వాళ్ళకి

నర్సు రోగితో:

"డబ్బు లెక్కలవల్ల ఆస్పత్రికి చేరానికదూ అన్నారు."

రోగి: (నిట్టూర్పుతో).

"అవునుతల్లీ అవును. పాత బాకీకోసం బైలర్ వస్తుంటే అవతల రోడ్డుమీదికి పోయాను. అటు పాలవాడు కనపడేసరికి ఎటూతోచక కారుకింద పడ్డాను, ఇదీ కథ"

మన వంటలూ వస్తువులూ అయితే కొత్తగాని, మనకి వాళ్ళవి కొత్త కావుగా. ఇవ్వడానికి ఏముంటె ఉంటుంది? పైగా స్వదేశంనుంచి ఆరు వేల మైళ్ళపైగా ప్రయాణం చేసి, ఇటువంటి దేశంలో పని చెయ్యడానికి ఒప్పుకున్నది ఆర్జించే డబ్బు దుబారా చెయ్యడానికి కాదు. ఇక్కడి తెల్లవాళ్ళు జాగ్రత్తగా డబ్బు కూడబెట్టుకుని, కొంత కాలానికి శాశ్వతంగా ఇంగ్లండు వెళ్ళిపోడానికి తహతహలాడతారు. దాంట్లో తప్పేముంది?

ఒంటరిగా నంచోనంగల్ల పేట్ రావ్ తలలో అన్ని విధాలైన తలపులూ తిరుగాడుతున్నాయి. ఒకమూల కుర్రకారు— రగ్గర్ ఆటగాళ్ళు-సుమిగూడి కేరింతలు కొడుతూ, అల్లరి చేస్తున్నారు. వాళ్ళంతా రీటా చుట్టూ తిరుగాడుతూ ఉండవలసింది. "ఈ ఆకతాయి వెధవలంతా హక్కు ఉన్నట్టు నీతో డాన్సు చెయ్యడానికి, తగువులాడుకుంటుంటే నవ్వుతూ ఊరుకుంటావేం?" అని రీటాని అడిగింది సుశీ ఒకసారి క్లబ్బులో డాన్సుకి వచ్చినప్పుడు ఆనాటి సుశీ ప్రశ్న తిరిగి అతని స్మృతిపథంలో చిన్న తుఫాను లేవదీస్తుంది. పెళ్ళికాని ఇంగ్లీషు కుర్రకారుకి సరదాగాఉండే ఆడవాళ్ళని చూస్తే మతిపోయేమాట నిజమే. వాళ్ళకి ఈ ప్రాంతల్లో కబుర్లాడుకోడానికి కూడా ఆడపిల్లలు దొరకరు. ఇంక రీటా వంటి అందమైంది, చమత్కారమైంది తటస్థపడితే చెప్పాలా? అయితే రీటా తెలివైంది. వాళ్ళందరినీ అదుపులో పెట్టగల సమర్థురాలు. "బ్రిటిష్ కమ్యూనిటీలో నా కున్న స్థానం రీటా వల్ల కాదుగదా?" భయంకరమైన తలపు వచ్చిందతనికి. వెంటనే మరిచిపోడానికి ప్రయత్నించాడు. ఇంటికి వెళ్ళిపోవాలనిపించింది. కాని ఇంకా ఒక్కరూ కదలడం ప్రారంభించలేదు. నీరసంగా ఒక మూలచేరి కొంచెం, కొంచెం విస్కీ చప్పరించడం మొదలుపెట్టాడు.

* * *

పార్టీ శ్రుతి నిముష నిముషానికీ హెచ్చుతూంది. కొంతసేపటి క్రితం మందరస్థాయిలో సాగుతున్న కబుర్లు, నవ్వుల్లోకీ, అరుపుల్లోకీ దిగాయి. బల్లమీద సీసాల్లో విస్కీ, బీయర్, రమ్, షెర్రా అతి వేగంగా హరించుకు పోతున్నాయి. కుర్రకారు కోలాహలం గరిష్ఠప్రమాణం అందుకుంది. పాటలు పాడేవాళ్లు, ఆటలు ఆడేవాళ్లు, చిలిపికజ్జాలు పెట్టుకునేవాళ్లు, గ్లాసులు బద్దలు కొట్టేవాళ్లు, యుక్తాయుక్త విచక్షణ జ్ఞానం అంతరించినట్టు ప్రవర్తించేవాళ్లు. పార్టీలో కొందరు పెద్దలు ఏవగించుకున్నారు. కాని చెయ్యగలిగిందేమీ లేకపోయింది. ఇక్కడ ఉన్న బ్రిటిష్‌వాళ్లని


మీ సొమ్మునకు మేలైన విలువ




మీరు కొనుటకు వెచ్చించిన సొమ్ములోని ప్రతి రూపాయికి ప్రతిఫలము గామీకు నెలలకు తగబడి శ్రమనీయక, అధిక కాలం పనిచేసే బ్యాటరీయే సరసమైన ధరగల బ్యాటరీ. ఈ పనినే నమ్మకంగా చేసేది సిల్వర్ ఎక్సైడ్ బ్యాటరీ తయారీలో నిశితమైనపరీక్షలకు గురిచేయుబడినది గాన, ఎక్కువ శక్తి నిల్వచేసి, శక్తివంతింగా పని చేయునట్లు నిర్మింపబడినది.

* అధికకాలం మనగల పి బి 95 అలాయిప్లేట్లు
* సామాన్యంగా చెడిపోని పోర్విక్ సెపరేటర్లు
* తాకిడికి తట్టుకొనగల గట్టి రబ్బరుకంటెయినర్లు

సిల్వర్ IS 395
ఎక్సైడ్

ఇతర బ్యాటరీలు నిల్చినా ఇదిమాత్రం ఇంకా పనిచేస్తూంది.

క్లోరైడ్ & ఎక్సైడ్ బ్యాటరీస్ (ఈస్టర్న్) ప్రైవేట్ లిమిటెడ్. EBSC 31

మద్రాసు, ఆంధ్ర, కేరళ, మైసూరు రాష్ట్రములకు ప్రధాన ఏజంట్లు:
జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మద్రాసు-2.
బ్రాంచీలు : కోయంబత్తూరు, బెంగుళూరు, సికిందరాబాగు.






కాల్గేట్
బేబి పౌడరు

పిల్లల చర్మమును చాల సుఖముగా నుంచును!

అనేక వేల మంది గృహిణులచే కొనియాడ బడిన అత్యుత్తమమైన శమనపరచే సువాసనగల పౌడరు!

CBP/8/1

# ★ నల్లతోలు ★

బల్లమీద లెక్కపెట్టవచ్చు. వాళ్ళలో ఈ సుగ్రకారుని మినహాయించివేస్తే మిగిలేదెవరు? పార్టీలూ, ఉత్సాహం కావాలంటే ఉన్న నలుగురూ కూడవసిందే. ఈ బర్యల్ని చూసీచూడనట్టు మసలవలసిందే. మరీ ఏవగించుకున్న కొందరు—భార్యలతో వచ్చినవాళ్ళు—ఏదో సాకు చెప్పి ముందు వెళ్ళిపోయారు. తక్కిన పెద్దలు ఆ పెద్ద బ్రిడ్జి రూమ్‌లో ఒకమూల ఒత్తిగిల్లి కబుర్లలో పడిపోయారు.

ఇంకొకప్రక్కన బ్రిటిష్‌యువకులు లేని ఆనందం అనుభవిస్తున్నామని తమని తాము నమ్మించుకోడానికి, ఒకళ్ళనొకళ్ళు ప్రోత్సహించుకుంటున్నారు. ఎవరు ఎక్కువ విస్కీ తాగగలరో పందెం కడుతున్నారు. ఒక్కగుటకలో గ్లాసుడు పానీయం ఖాళీ చెయ్యగలిగినవాడిని ముందుకు రమ్మంటున్నారు. విస్కీ, బీయర్ కలిపి తాగగల మొనగాడు ఉన్నాడా అని సవాల్ చేస్తున్నారు. ఈ పరీక్షల్లో గెలిచినవాళ్ళని భుజాలమీద కెక్కించుకుని విజయగీతాలాలపిస్తున్నారు. ఆనాటి సాయంత్రం రగ్గర్ ఫుట్‌బాల్ పోటీలో అగ్రస్థాయి ఆట ఆడిన డంకన్‌హార్వీని తమాషాగా దువ్వబడుతున్నారు. "ఇన్ని ఫ్రీకిక్స్‌ని గోలులోకి తన్నేవే, ఈ విస్కీబుడ్డిని తన్నగలవా?" అని అతన్ని రెచ్చగొట్టారు. "ఓ, తప్పకుండా." మత్తులో అరమూసుకుపోతున్న కళ్ళు నులుముకుంటూ తల ఎగరేశాడు డంకన్. "దటీస్ ది స్టఫ్, డంకన్." అందరూ చప్పట్లు కొట్టారు. డంకన్ హార్వీ విస్కీబుడ్డిని కాలిజోడుతో గోడకి తన్ని ముక్కముక్కలుగా చేసేశాడు. దూరంగా ఉన్న పెద్దలు మెడలు రిక్కించి ఏమిటా శబ్దం అన్నట్టు చూశారు. గుంపులో ఏం జరిగిందీ అంతుపట్టలేదు. మళ్ళీ విస్కీ గ్లాసుల్లో లీనమైపోయారు.

అకస్మాత్తుగా ఒక యువకుడికి ఇంత గోల పనికిరాదనిపించింది.

"మనం అనాగరికంగా ప్రవర్తిస్తున్నాం" అన్నాడు.

"షటప్" అని గుంపు అరిచింది.

ఆ యువకుడు ఊరుకోలేదు. పక్కనున్న బల్లమీద ఎక్కి అరిచాడు.

"లేడీస్ అండ్ జెంటిల్‌మన్—"

"లేడీస్ లేరు" అని తక్కినవాళ్ళు గోల చేశారు.

"లేడీస్ కావాలి, లేడీస్ కావాలి;" అందరూ అంటున్నారు. ఒక నిముషం ఊరుకొని మళ్ళీ ఆ యువకుడు మొదలు పెట్టాడు:

"మనం చెప్పలేనంత అనాగరికంగా ప్రవర్తిస్తున్నాం—"

"బూ...బూ..." అని గొంతుకలు హేళన చేశాయి. యువకుడు మళ్ళీ అంటున్నాడు.

"ఈ అల్లరి మాని మనం ప్రపంచ నాగరికతలో ప్రముఖస్థానం వహించిన బ్రిటిష్ యువకుల్లాగా ప్రవర్తించాలి."

"ప్రముఖస్థానం కాదు, అగ్రస్థానం," అతనిమాటల్ని వాళ్ళు సరిదిద్దారు.

"సరే అగ్రస్థానం, ఇప్పుడు మీరు చెయ్యవలసిందేమిటంటే బల్లల చుట్టూ ఉన్న కుర్చీలమీద అల్లరి చెయ్యకుండా కూచోండి."

"బల్లలేవు, కుర్చీలేవు."

ఆ యువకుడు నవ్వేశాడు. అందరూ నవ్వేశారు.

"లేకపోవడం ఏమిటి? ఇది శవాయ్ హోటలు. అర్థం అయిందా. ప్రపంచంలోకల్లా గొప్ప హోటలు."

"ఊఁ," అన్నారు అందరూ.

"అంతా బల్లచుట్టూ కూచోండి. ఇలాగ;" అతను బల్లమీదనుంచి కిందకి దూకి, అక్కడ కుర్చీలూ బల్లలూ ఊహించి గాలిలో కూర్చున్నాడు.

"బాగుంది, బాగుంది," అన్నారు అంతా.

"నేను బేరర్‌ని. శవాయ్‌లో బేరరంటే మాటలుకాదు, ఏమనుకున్నారో. అక్కడ టేబిల్ దొరకడమే కష్టం, కుదురుగా కూచోకపోతే పంపించేస్తాను."

"సరే."

"ఎర్ర తివాసీలతో నిండిన లౌంజ్, దానిమీద ఖరీదైన తోలుతో కుర్చీలు, సరంబీలో అతుక్కుపోయిన లైట్లనుంచి వచ్చే మెత్తని వెలుగు, సన్నని సంగీతం—"

"ఉబ్బెత్తు వక్షాలని ఊపుతూ నాట్యం చేసే పిల్లమాట ఏమిటి?" అని ఒకగొంతు అరిచింది.

## చచ్చు తెలివి

"చచ్చుతెలివిఅంటే ఏమిటో చెప్పలేను కాని దానికో ఉదాహరణ ఇవ్వమంటే ఇస్తాను."

'నేనే ఇహ ఇవ్వక్కర్లా, చాలుచాలు.'

"పిచ్చివాగుడు వాగకు. శవాయ్ మొహం ఎప్పుడైనా చూశావా నువ్వు? చీప్ నైట్ క్లబ్బనుకుంటున్నావా? ఇక్కడ అటువంటి వేషాలేవీ పనికిరావు."

"నాకదంతా తెలియదు. పెద్ద రొమ్ములూ, సన్నటి నడుమూ, బ్లాండ్ జుట్టూ ఉన్న అందగత్తె నాట్యం కావాలి," అని లేచిందా గొంతు.

అందరూ గొల్లుమని నవ్వారు. ఒకతను లేచి, "సరే, నేను నాట్యం చేస్తాను." అన్నాడు. "నాకు రొమ్ములు లేవు, ఈ రెండు సీసాలనీ చొక్కాకింద పెట్టుకుంటే సరిపోతుందా?" అని కోటువిప్పి దూరంగా పారేశాడు. అందరూ సంతోషంగా అరిచారు.

"ఇది లాభంలేదు. బర్లెస్క్ కావాలి," అన్నాడు ఇంకొకడు.

"ఔను," అందరూ ఒప్పుకున్నారు.

ఇంగ్లండు విడిచిపెట్టి ఎన్నో ఏళ్ళుగా ఇండియాలోనే ఉండిపోయిన బ్రిటిష్ యువకులందరికీ ఒక్కసారి ఇంటిమీదకి మనసుపోయింది. మూగబాధ వాళ్ళని క్రుంగదీసింది. లండన్, హైడ్‌పార్క్, బిగ్ బెన్, నెంబర్ టెన్ డౌనింగ్ స్ట్రీట్, నైట్‌క్లబ్స్, బర్లెస్క్, పబ్స్, సినిమాలు, ఆడపిల్లలు,—చక్కటి ఆడపిల్లలు, శనివారం సాయంత్రం ఆఫీసులు మూసేసిన తరవాత సినిమాలకీ, నాటకాలకి, పార్కులకీ ఎక్కడికి పడితే అక్కడికి తనుకూడా విలాసాలకి వచ్చే ఆడపిల్లలు!—తరువాత ఇల్లు, తల్లి, తండ్రీ, అక్కలు, చెల్లెళ్ళు. ఆ అనుభవాల ఊహల్లో తియ్యనిబాధ వాళ్ళని ఆవరించింది. వాళ్ళ కోలాహలంలో మాతృదేశంమీద మమత, వాళ్ళ ఉత్సాహంలో దీనత్వం, వాళ్ళ నవ్వుల్లో శోకపుఛాయలు మిళితమై ఉన్నాయి.

"సరే, అదంతా తర్వాత. ముందు మీరంతా కూర్చోండి, నేను షాంపైన్‌తో మీ గ్లాసులు నింపుతాను," అన్నాడు మొదటి యువకుడు.

"నేనుకూడా నీకు సహాయం చేస్తాను" అని డంకన్ హార్వీ లేచాడు.

ఇద్దరూ జేబురుమాళ్ళు పైకితీసి, బల్లమీద ఉన్న వైన్‌బుడ్లకి చుట్టి ఊహా కుర్చీల్లో కూర్చున్న యువకులకి ఉత్తుత్తి షాంపైన్ కొంచెం కొంచెం విగులుస్తున్నారు. అకస్మాత్తుగా డంకన్ హార్వీ కళ్ళు ఎడంగా కూర్చున్న పీటర్ రావ్ మీదకి పోయాయి.

"ఇక్కడికి నల్లవాడెలావచ్చాడు?" అని అరిచాడు. అందరి మొహాలూ పీటర్ రావ్ వైపు తిరిగాయి. అతనికి ఏం చెయ్యాలో తెలియలేదు. డంకన్‌హార్వీ బుడ్డి చేతులో పట్టుకుని అసహ్యం ఉట్టిపడే కళ్ళతో పీటర్ రావ్‌ని సమీపించాడు.

(62-వ పేజీ చూడండి)

మీ పిల్లలు బాగా
అల్లరిచేస్తూవుంటే
ఏం చెయ్యాలో
మీకు తోచటంలేదా?
బుడుగు పుస్తకం ఒకటి కొనుక్కుని
గబగబ చదివెయ్యండి.
బుడుగే అన్నీ మప్పుతాడు మీకు.
వాడు రంగుల ఆటా,
రంగురంగులబొమ్మలా
వెల: రూపాయి పావలా
ఆంధ్ర గ్రంథమాల,
7 తంబుచెట్టి వీధి, మద్రాసు-1.







# ★ నల్లతోలు ★

[36-వ పేజీ తరువాయి]

"ఎవరునువ్వు? ఎలా లోపలికి చొరబడ్డావ్?" అని గద్దించాడు.

"డంకన్—" పేట్ రావ్ మాటలు తడబడ్డాయి. పరిస్థితి విషమించిందని, అక్కడివాళ్లంతా తాగి ఉన్నారని గ్రహించాడతను. ఒక్క క్షణంలో యువకులంతా పేట్ రావ్ చుట్టూ మూగారు.

"ఇక్కణ్ణుంచి పో, ఈ హోటల్లో నల్లవాళ్ళకి తావులేదు" రెట్టించాడు డంకన్ హార్వీ.

"డంకన్, శవాయ్‌లో అటువంటి ఆంక్షలేదుకదా!" పేట్ రావ్ తేలిగ్గా నవ్వెయ్యడానికి ప్రయత్నించాడు.

"శవాయ్ సంగతి నాకు తెలీదు. నిజానికి నేనా హోటల్లో ఒక్కసారయినా అడుగు పెట్టలేదు. కాని నిన్నిక్కడ ఒక్క నిముషమైనా ఉండనివ్వను, పో," అన్నాడు హార్వీ.

అక్కడివాళ్ళలో ఒక్కడయినా శవాయ్ మొహం చూసి ఉంటాడన్న అనుమానం పేట్ రావ్ కి లేదు. తను ఎన్నో పార్టీలకి ఆ హోటలుకి వెళ్లాడు. అప్రయత్నంగా అతనిలో గర్వం పొడసూపింది.

"నేనిక్కడికి ఆహ్వానంమీద వొచ్చాను," అన్నాడు.

"ఏది ఆహ్వానం?"

అతను తీసుకురాలేదు. స్టూవర్ట్‌ని అడగమన్నాడు.

"మేం ఎవర్నీ అడగం. నీకు తాగడానికి పర్మిట్ ఉందా?"

ఒకగొంతు ప్రశ్నించింది.

పేట్ రావ్ చిక్కులోబడ్డాడు. తాగుడు మైకంలోకూడా ఎవరికో కొంత మెలకువ ఉన్నట్టుంది. తాగిఉండబట్టి కాని లేకపోతే వాళ్ళెవ్వరూ ఇటువంటి అఘాయిత్యానికి పూనుకోరని అతనికి తెలుసును. అయినా అతనికి కోపం ఆగలేదు.

"నాకు పర్మిట్ అక్కర్లేదు,"అన్నాడు.

"ఊరికే పేలకు,"అని పేట్ రావ్ రెక్క పట్టుకుని ఈడ్వడం ప్రారంభించాడు డంకన్ హార్వీ. పేట్ రావ్ కొంత గింజుకున్నాడు. నలుగురూ సాయంపట్టి అతన్ని గదిబయటకి నెట్టి తలుపు మూసేశారు.

ఈ విషయం విని మిస్టర్ స్టూవర్ట్ రెచ్చిపోయాడు. "బ్రిటిష్ యువకులంతా మృగాల్లాగా ప్రవర్తించారు," అన్నాడు. "నా అతిథిని అవమానపరచడానికి డంకన్‌కి ఏం అధికారం ఉంది?" అని గర్జించాడు. "అంతా వెళ్ళి పేట్‌కి క్షమాపణ చెప్పుకోండి," అన్నాడు.

డంకన్ హార్వీ ముందుకువచ్చి నిలబడ్డాడు.

"మేం చెప్పం" అన్నాడు. "నల్లతోలుకి క్షమాపణ చెప్పుకోవలసిన అగత్యం మాకు లేదు."

"నల్లతోలైతేనేం? పేట్ మీ అందరికన్నా లక్షరెట్లు మెరుగు. అతని అంతస్తు తెలిసే మాట్లాడుతున్నావా?"

మిస్టర్ స్టూవర్ట్ ఉద్రేకంలో ఊగిపోతున్నాడు.

"నీ దేశంలో నువ్వు కనీవినీ ఎరగని సౌకర్యాలు పేట్ అక్కడ అనుభవించాడు. నా దేశంలో నువ్వు మాట్లాడడానికి తాహతులేని మనుషులతో అతనికి స్నేహం ఉంది. పేట్ ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్నాడు. నువ్వెప్పుడయినా ఆక్స్‌ఫర్డ్ పేరు విన్నావా?"

వ్యంగ్యంగా నవ్వాడు మిస్టర్ స్టూవర్ట్. డంకన్ హార్వీ మరీ బిగిసిపోయాడు.

"అదంతా నాకనవసరం. తాగడానికి పర్మిట్ లేనివాణ్ణి నువ్వు ఎలా కాక్‌టైల్స్‌కి పిలిచావు?" అని ప్రశ్నించాడు.

పేట్ రావ్ ఇంట్లో తెగతాగే డంకన్ హార్వీయేనా మాట్లాడుతున్నది! మిస్టర్ స్టూవర్ట్ తెల్లబోయాడు. తక్కిన యువకులు హార్వీ ప్రశ్నని రెట్టించారు. మిసెస్ స్టూవర్ట్ పరిస్థితి గ్రహించింది.

"జాన్ అలిసిపోయి ఉన్నారు. అతన్ని బాధపెట్టకండి. కొంచెం విశ్రాంతి తీసుకోనివ్వండి" అని మొగుణ్ణి బయటకి తీసుకుపోయింది.

"ఉన్న తెల్లవాళ్ళం నలుగురం. నలుగుర్లోనూ పోట్లాట,"అన్నారు వెనక కొందరు.

"జరిగింది తప్పేననుకో. అయితేమటుకు నల్లవాణ్ణి వెనకేసుకువస్తూ తెల్లవాళ్ళమీద విరుచుకుపడతారా?" అన్నారు ఇంకొందరు.

"మనంలో మనం ఎంత కొట్లాడుకున్నా నల్లవాడి విషయం వచ్చినప్పుడయినా కలిసికట్టుగా ఉండాలి మరి" అన్నారు ఇంకొందరు.

మిసెస్ స్టూవర్ట్ మొగుణ్ని లౌంజ్‌లో ఒక మూల కూర్చోపెట్టి హితబోధ చేసింది.

"ఈ విషయం మరిచిపోవడం ఉత్తమం" అంది


"పేట్ మన అతిథి మేరీ," అన్నాడు మిస్టర్ స్టూవర్ట్ కష్టంగా.

"నీ బాధ నాకు తెలుసు. కాని చెయ్యగలిగిందేమీ లేదు."

"లేకపోవడమేమిటి?" కోపంగా లేచాడు మిస్టర్ స్టూవర్ట్.

"ఈ దున్నపోతులంతా పేట్‌కి క్షమాపణ చెప్పితేకాని ఊరుకోను."

# ఆంధ్ర గళ్ళనుడికట్టు 13.



## ఆధారాలు

### అడ్డము

1. సదరు దోని రాయలసీమలో ఉంటుంది.
3. సంపాదకుడి భావన దక్షిణ.
5. అనువుగ వాగముట!
6. తొందరతనములో విలువైన నది.
8. ఇంకొకలాగ ముక్కోణము.
11. పూలమాలికలో లక్షు నష్టమైనా అనర్థకం కాదు.
14. ఇది పాముకో రవ్వంత. లోపల విషమున్న గుంగి.
15 ఈ బిళ్ళ తీపిమందు కాదు.
16. ఇంకను దోయిలి ఘటించితే నడుమ కనుల జత సంప్రాప్తమౌను!
17. మేము గురుసుతనంలో గిడసబారుట.

### నిలువు

1. పేకలో పెద్దముక్క పత్రికలో పెద్ద చెక్క కలిస్తే వైద్యశాల.
2 అల్లవాని రణము దుంప తెంపి ఎలాగో నివారించుట సాధించవచ్చు.
3. సంకరము కాగా అయిన యుద్ధము.
4. ఇది ఎంతమాత్రము లాభము కాదు.
7. బలిచక్రవర్తిని చివర సాయం తీసుకొని మనిషిని చంపడం.
9. నీకో నమస్కారం! తల కొట్టేశక్కగా ప్రేలాడ తీయవచ్చు.
10. సగం చేయి - కొందరింగులో స్వర్గం చూపిస్తారు.
12. మాబుషులు వీళ్ళని చెప్పేది.
13. శ్రీమంతులు స్వప్నంతో మొదలవుతారు.
14. పట్టాభిషేకం నోచుకోని పాంకోడు.

## 12-వ నుడికట్టుకు జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | ■ | 1అం | త | రా | య | 2ము | ■ | ■ |
| ■ | ■ | ప | ■ | ■ | ■ | ద్ద | ■ | ■ |
| 3పా | లి | కా | 4పా | ■ | 5పా | రా | వా | 6రం |
| త | ■ | 7లు | చ్ఛా | ■ | 8పి | లు | ■ | గ |
| క | ■ | ■ | ■ | ■ | ■ | ■ | ■ | వ |
| ల | ■ | 9ప్ర | 10తి | ■ | 11మం | 12చె | ■ | ల్లి |
| 13ప | ట్టు | కా | రు | ■ | 14కు | క్క | తో | క |
| ■ | ■ | శ | ■ | ■ | ■ | డ | ■ | ■ |
| ■ | ■ | 15ము | ష్టి | బి | య్యం | ము | ■ | ■ |

"కుదరదు జాన్" అంది ఆవిడ.

"ఏం?"

"డంకన్ ఎంత ఆవేశంలో ఉన్నాడో చూశావా?"

"వాడికి బుద్ధి చెబుతాను."

"జాన్, నీ ఆదర్శాలు కట్టిపెట్టు. నీకు డంకన్ ముఖ్యమా, పేట్ ముఖ్యమా? పేట్ మంచి స్నేహితుడు, నేనూ ఒప్పుకుంటాను, కాని ఈ పరిస్థితుల్లో——"

మిస్టర్ స్టువర్ట్ ఏమీ మాట్లాడలేదు. మళ్ళీ ఆవిడ అంది.

"డంకన్ తాగుడు మైకంలో ఏదో చేశాడు తప్పే. దానికింత రాద్ధాంతం దేనికి? డంకన్‌కి అతని రగ్గర్‌కి మనవాళ్ళల్లో ఉన్న స్థానం నీకు తెలుసుగదా. అతనితో విరోధం పెట్టుకోడం ఇక్కడ బ్రిటిష్ కమ్యూనిటీతో పెట్టుకోవడం."

"రగ్గర్, డంకన్, రగ్గర్! ఇంతకంటే జీవితంలో కావలసింది లేదా?" మిస్టర్ స్టువర్ట్ అరిచాడు.

"ఇంకొక విషయం జాన్! పమీలా కోసమైనా నువ్వు మొండిపట్టు మానెయ్యాలి."

మిస్టర్ స్టువర్ట్‌కి అర్థమయింది. పమీలా వాళ్ళ కూతురు. డంకన్ హార్వీమీద మనసు పెట్టుకుని కూచుంది. హార్వీకి ఇంకా పాతికేళ్ళు నిండలేదు. మంచి కంపెనీలో పెద్ద ఉద్యోగం వుంది. అందం ఉంది. రగ్గర్ ఆట మూలంగా బ్రిటిష్ కమ్యూనిటీలో పేరు ప్రఖ్యాతులున్నాయి. డంకన్ హార్వీ వంటి అల్లుడికంటే ఇక్కడి బ్రిటిషు దంపతులు కోరదగిన మంచిసంబంధం లేదు.

మిస్టర్ స్టువర్ట్ గొంతు మూగపోయింది. తల వంచుకుని చేతిలోని విస్కీవైపు దృష్టి ప్రసరించాడు. గ్లాసు ఎత్తి ఒక్క గుటకలో నోట్లో పోసేసుకుని జేబురుమాలుతో మూతి తుడుచుకున్నాడు.

మిసెస్ స్టువర్ట్ కళ్ళల్లో చిరునవ్వు విజయసూచనగా తళుక్కుమంది. సోఫాలో నుంచి లేచి, ప్రేమతోనూ, సానుభూతితోనూ మిస్టర్ స్టువర్ట్ భుజం తట్టి బుగ్గమీద అంటీ అంటనట్టు చిన్న ముద్దు పెట్టింది. తరవాత డ్రాయింగ్‌రూమ్‌లో యువకుల దగ్గరకి వెళ్ళి అంది:

"జాన్‌కి కొంచెం తలనొప్పిగా ఉండి, ఇక్కడికి రాలేనందుకు క్షమాపణ చెప్పమన్నాడు. మిమ్మల్ని మిగిలిన డ్రింక్ తాగేసి మజా చేసుకోమన్నాడు."

అందరికీ సందేశం అర్థమయింది. వాళ్ళ మొహాలు కళకళలాడాయి.

"టు ది హెల్త్ ఆఫ్ మిస్టర్ అండ్ మిసెస్ స్టువర్ట్?"

తృప్తిగా గ్లాసులు నింపుకుని అరిచారు.

ఎవరో గొంతెత్తి పాట ప్రారంభించారు.

"హీ యీజ్ ఏ జాలీ గుడ్ ఫె...లో, హీ యీజ్ ఏ జాలీ గుడ్ ఫే—లో..."

అందరూ అందుకున్నారు.

బయట క్లబ్బు ఆవరణలో కారుకోసం వెతుక్కుంటున్న పేట్ రావుని దూరంగా వినిపిస్తున్న పాట కలతపెట్టింది. తన ఇంట్లో పార్టీలు ఇచ్చినప్పుడు ఇవే గొంతుకలు, ఇదేపాట తనగురించి ఎన్నో సార్లుపాడాయి. గబగబా అడుగులు వేసుకుంటూ సాగిపోయాడు. ఎప్పటి స్థానంలో నిలబడివున్న నల్లటి విలువైన జాగ్వార్ కారు చిక్కని చీకట్లో సరిగ్గా కనిపించలేదు. దానిమీద పడి చేతికి చిన్న గాయం తగిలించుకున్నాడు. నల్లని చీకటినీ, కారు రంగునీ, ముందు సీటులో గాఢంగా 'నిద్రపోతున్న' డ్రైవర్నీ తిట్టుకుంటూ కార్లో ఎక్కి హారన్ వాయించాడు. డ్రైవర్ తుళ్ళిపడి లేచి, సీటులో పడి నలిగివున్న టోపీ తలకి తగిలించుకుని, కారు పోనిచ్చాడు. ★

---

తప్పున చెప్పుకోండి జవాబులు:

కీ; దేహం; బర్మా, బొంబాయి; తార, సినీనటి, రకం, కంగారు; నగలు; అక్బర్.